# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-02-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లోని మున్సిపాలిటీలలో మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పి. నారాయణ తెలిపారు.**
2. **తెలంగాణలో బీసీలకు సామాజిక న్యాయం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.**
3. **రాష్ట్రంలోని వసతి గృహాల్లో మెరుగైన వసతులను కల్పించనున్నామని ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ శాఖా మంత్రి ఎస్.సవిత తెలిపారు.**
4. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ విద్యార్థులతో సంభాషించే 'పరీక్షా పే చర్చ' కార్యక్రమం రేపు జరగనుంది.**
5. **ఆంధ్రప్రదేశ్‌లోని కోటప్పకొండ తిరునాళ్లను ప్రజలందరూ విజయవంతం చేయాలని నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయులు పిలుపునిచ్చారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీలలో మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరులో నిన్న మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 80 శాతం మంది ప్రజలకు త్వరలోనే కేంద్ర ప్రభుత్వ అమృత్ పథకం కింద తాగు నీటిని అందిస్తామన్నారు. అంతేకాకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ.. పార్కుల అభివృద్ధి.. క్రీడా మైదానాల ఆధునికీకరణ కార్యక్రమాలను చేపడతామన్నారు. స్వచ్ఛభారత్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం నిధులను కేటాయించిందని త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులను విడుదల చేస్తుందన్నారు. భవన నిర్మాణ అనుమతులకు సంబంధించిన నిబంధనలను సరళతరం చేశామని మంత్రి వివరిస్తూ....

..వాయిస్...36 సెకన్లు

--------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈ నెల 11వ తేదీన మంత్రులు, ప్రభుత్వ శాఖల కార్యదర్శుల సదస్సు జరగనుంది. సచివాలయంలోని ఒకటో బ్లాక్‌లో ఈ సమావేశం నిర్వహిస్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సాధించిన విజయాలు, ఈ ఏడాది మార్చి వరకు తీసుకోవాల్సిన

చర్యలపై కార్యాచరణ ప్రణాళిక, ఎన్నికల హామీల అమలు, కేంద్ర బడ్జెట్ ద్వారా రాష్ట్రానికి వచ్చే ఆర్థిక ప్రయోజనాలు, ఇతర అంశాల గురించి ఈ సదస్సులో చర్చిస్తారని అధికారులు తెలిపారు.

---------------------------

విద్యార్థులలో పరీక్షల ఒత్తిడిని తగ్గించేదుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ వారితో సంభాషించే 'పరీక్షా పే చర్చ' కార్యక్రమం రేపు జరగనుంది. ఈ కార్యక్రమాన్ని అందరూ వీక్షించాలని రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి డైరెక్టర్ కృష్ణారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేయాలని ఆర్జేడీ, డీఈఓ, డైట్ ప్రిన్సిపాళ్లకు సూచించారు. ఉదయం 11గంటలకు దూరదర్శన్, ద్వారా డీడీ నేషనల్, డీడీ న్యూస్, డీడీ ఇండియా, రేడియో ఛానెళ్ల ద్వారా ప్రత్యక్ష ప్రసారం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణలో బీసీలకు సామాజిక న్యాయం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక కులగణనపై బీసీ సంఘాలతో మంత్రి నిన్న సమావేశమయ్యారు. ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు, బీసీ కమీషన్ చైర్మన్ నిరంజన్, బీసీ కమిషన్ సభ్యులు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. బీసీ సంఘాల నేతలు ఆర్ కృష్ణయ్య, మాజీ బీసీ కమిషన్ చైర్మన్ వకులా భరణం కృష్ణమోహన్ రావు కులగణన నివేదికపై తమ అభిప్రాయాలు ఈ సమావేశంలో తెలియజేశారు.

---------------------------

రాష్ట్రంలోని వసతి గృహాల్లో మెరుగైన వసతులను కల్పించనున్నామని ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ శాఖా మంత్రి ఎస్. సవిత తెలిపారు. తిరుపతిలోని పద్మావతి అతిథి గృహంలో బిసి సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి నిన్న సాయంత్రం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ బిసి సంక్షేమ వసతి గృహాల్లో వసతులను కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా క్లినికల్ సైకాలజీ కోర్సులు ప్రారంభించనున్నట్లు రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. మానసిక సమస్యలతో బాధపడుతున్న వారికి చికిత్స చేయడంతోపాటు ఉపశమనం కలిగించేందుకు క్లినికల్ సైకాలజిస్టులు తోడ్పడతారని నిన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత అవసరాల దృష్ట్యా రెండేళ్ల వ్యవధితో కూడిన ఎంఫిల్, ఏడాదిపాటు కొనసాగే ప్రొఫెషనల్ డిప్లొమా ఇన్ క్లినికల్ సైకాలజీ కోర్సులు ఎంపిక చేసే సంస్థల్లో ప్రారంభించడానికి త్వరలోనే మార్గదర్శకాలు విడుదల చేస్తామని వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని పల్నాడు జిల్లా కోటప్పకొండ తిరునాళ్లను పార్టీలు, కులాలు, మతాలకతీతంగా విజయవంతం చేయాలని నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయులు పిలుపునిచ్చారు. కోటప్పకొండలో శివరాత్రి ఏర్పాట్లను నిన్న సాయంత్రం మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. రాష్ట్రం నలుమూలల నుంచి పాతికలక్షలమందికి పైగా భక్తులు తిరునాళ్ళకు వచ్చే అవకాశం ఉందని వారికి ఏ విధమైన ఇబ్బందులు లేకుండా సదుపాయాలు కల్పించడంపై దృష్టి పెట్టామని శ్రీకృష్ణదేవరాయులు పేర్కొంటూ..

వాయిస్ ..30 సెకన్లు

కాగా,కృష్ణ, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో, రాజకీయ నాయకులు, అధికారులు పరిమితంగా పర్యవేక్షణలో పాల్గొంటున్నారు.

---------------------------

సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షకు దరఖాస్తు చేసుకునే గడువును ఈనెల 18వ తేదీ వరకూ పొడిగించినట్లు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఒక ప్రకటనలో తెలిపింది. తొలుత ప్రకటించిన ప్రకారం ఈనెల 11న సాయంత్రం 6 గంటలకు పూర్తి కావాల్సి వుండగా దానిని ఈనెల 18వ తేదీ సాయంత్రం 6 గంటల వరకూ పొడిగించారు. తమ దరఖాస్తులో సవరణలు చేయాలనుకునే అభ్యర్థుల కోసం వెబ్‌సైటులో ఒక కరెక్షన్ విండోను ఈనెల 19 నుంచి 25 తేదీ వరకూ తెరచి ఉంచనున్నట్లు అధికారులు తెలిపారు.

---------------------------

అభ్యంతరాలు లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సూచించింది. దీనికి గాను గ్రామ/వార్డు సచివాలయాలు, మీసేవా కేంద్రాల్లో దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపింది. ఈ మేరకు భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జయలక్ష్మి నిన్న ఒక ప్రకటన విడుదల చేశారు. 2019 అక్టోబరు 15 ముందు జరిగిన ఆక్రమణలకు సంబంధించిన దరఖాస్తులు మాత్రమే ఈ ఏడాది డిసెంబరు 31వ తేదీ వరకు స్వీకరించబడతాయని ప్రకటనలో తెలిపారు.

---------------------------

తెలంగాణ లాసెట్‌కు మార్చి 1 నుంచి, ఈసెట్‌కు మార్చి 3నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించాలని ఉమ్మడి ప్రవేశ పరీక్షల కమిటీ నిన్న ఖరారు చేసింది. ఇంటర్ విద్యార్హతపై ఐదేళ్ల ఎల్‌ఎల్‌బీ, డిగ్రీ విద్యార్హతపై మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌బీ పూర్తయిన వారికి రెండేళ్ల ఎల్‌ఎల్‌ఎం కోర్సుల్లో ప్రవేశానికి లాసెట్ నిర్వహిస్తారు. పాలిటెక్నిక్ డిప్లొమా, బీఎస్‌సీ – గణితం పూర్తి చేసిన వారు లేటరల్ ఎంట్రీ ద్వారా బీటెక్, బీఫార్మసీ కోర్సుల్లో నేరుగా రెండో ఏడాదిలో చేరేందుకు ఈసెట్ నిర్వహిస్తారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని ఫిబ్రవరి 11వ తేదీన దర్శించుకోడానికి తిరుపతి స్థానికులకు ఈరోజు టోకెన్లు జారీ చేయనున్నట్టు తిరుమల తిరుపతి దేవస్థానం ఓ ప్రకటనలో తెలిపింది. రథసప్తమి నేపథ్యంలో ఫిబ్రవరి నెలలో స్థానికులకు శ్రీవారి దర్శనాన్ని టిటిడి మొదటి మంగళవారం నుంచి రెండో మంగళవారానికి మార్చింది.

---------------------------

రైతులు ఒకే పంట మీదే ఆధార పడకుండా అంతర పంటల సాగు ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. ములకలపల్లి మండలం, పాతూరు గ్రామంలో సాగు చేస్తున్న ఫామ్ పౌండ్ లో చేపల పెంపకాన్ని ఆయన నిన్న పరిశీలించారు. చేపల పెంపకం, మునగ, నాటు కోళ్లు, తేనెటీగల వంటి అంతర పంటల సాగు ద్వారా రైతులు అధిక లాభాలను పొందవచ్చని కలెక్టర్ తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు కిడ్నీ వ్యాధుల ప్రభావిత ప్రాంతాల్లో వైద్య ఆరోగ్యశాఖ.. వివిధ శాఖల సమన్వయంతో విస్తృత జనజాగృతి కార్యక్రమాలు నిర్వహించాలని, కార్యక్రమాల నిర్వహణ, పర్యవేక్షణకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. నిన్న కిడ్నీ వ్యాధి ప్రభావిత ప్రాంతాల్లో నివారణ, నియంత్రణ పరంగా భవిష్యత్తు కార్యాచరణపై కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు.

======================